# ఎదురు తిరిగింది

ఆ రోజే రామయ్య పంతులకి నెలజీతం ముట్టింది. జీతం పట్టుకొని, యింటికి రాగానే భార్య రవణమ్మ ఆ నెలకి ఏయే వస్తువులు కావాలో చూసుకుంటోంది.

రామయ్య పంతులు కోర్టులో ఒక చిన్న గుమాస్తా పని చేస్తున్నాడు. నెలకి నూరు రూకలు ముట్టుతూ ఉంటాయి. అయినా మొదటి తారీఖున జీతం వస్తే మూడో తారీకున ముష్టికి బయలు దేరవలసిన బాపతే. దానికి తోడు గంపెడు పిల్లలు కూడా ఉన్నారు.

నెలలో వాడే వస్తువు లన్నీ చూసుకున్న తర్వాత, రవణమ్మ "రెండు శేర్లు కందిపప్పూ, శేరు మినపప్పూ, మూడు శేర్లు ఉప్పూ" అంటూ కస్తూరిబిళ్ళల దగ్గర్నుంచి, బియ్యం వఱకూ ఏకరువు పెట్టింది.

అన్నీ విన్నతర్వాత రామయ్య "నాకు ఈమధ్య చాలా పని ఉంటోంది. అంచేత వీలున్నప్పుడు తెస్తాన్లే" అన్నాడు.

రవణమ్మ "అన్నట్టు చెప్పడం మరచిపోయానండోయ్! నాకాసుల పేరు పెరిగిపోయింది. (పెరిగిపోవడమంటే తెగిపోడం అన్నమాట. 'తెగిపోయింది' అని, ఆడవాళ్లు అనకూడదట.) ఏ కంసాలికేనా యిచ్చి, బాగుచేయించండి" అని కూడా చెప్పింది.

"వీలుంటే చూస్తాన్లే" అంటూ రామయ్యపంతులు పనిమీద ఎక్కడికో వెళ్ళిపోయాడు.

వీళ్ళ సంభాషణంతా పక్కనే గోడచాటునుండి, ఓ దొంగ విన్నాడు. కాసుల పేరు సమాచారం కూడా విన్నాడు. వెంటనే వాడో కాగితం తీసుకొని, దానిమీద రవణమ్మ భర్తకి చెప్పిన వస్తువులన్నీ ఒకటీ పొల్లుపోకండా ఎక్కించుకున్నాడు.

శ్రీ శ్రీపాద
వెంకటాచలం

మర్నాడు ఆ దొంగ బజార్లోకి వెళ్ళి, తా నెక్కించుకొన్న వస్తువులన్నీ ఒకటీ తప్పిపోకండా కొని, ఒక పెద్ద బుట్టలో వేసుకొన్నాడు. అన్నీ కొనేటప్పటికి దొంగకి యాభై రూపాయలు వదిలాయి. ఆ బుట్ట బుజాన్నేసుకొని, దొంగ తిన్నగా రవణమ్మ యింటి కొచ్చాడు.

రవణమ్మని పిల్చిన తర్వాత, దొంగ "అమ్మా! బాబుగోరు ఏదో పనిమీ దున్నారమ్మా! ఇవన్నీ కొని, ఇంటికి వెళ్లి, యిచ్చి రమ్మన్నారు" అన్నాడు.

రవణమ్మ బుట్టలోవన్నీ తీసుకొనివెళ్ళి, వంటయింట్లో భద్రంగా వుంచుకొని వచ్చి, "ఇంకేమేనా చెప్పారా?" అని, అడిగింది.

"ఆ సెప్పారమ్మా! పెరిగిపోయిన కాసులపేరు ఉందిటమ్మా! దాన్ని బాగు సేయిస్తారట. పట్టుకొని రమ్మన్నారు." అన్నాడు దొంగ.

రవణమ్మ లోపలికి వెళ్ళింది. ఎందుచేతనో యివ్వ బుద్ధి పుట్టలేదు. తిరిగివచ్చి, దొంగని నిదానంగా చూసి, "నిన్ను నేనెప్పుడూ చూళ్ళేదే! నిన్ను నమ్మడం ఎలాగ?" అంది సంకోచిస్తూ.

దొంగ "ఆ వస్తువులన్నీ కొని, పంపించి, దాన్ని తీసుక రమ్మన్నారండీ బాబుగోరు. దీని కింత అనుమానం ఎందుకమ్మా?" అన్నాడు.

"అది కాదోయ్! నిన్ను నేనెప్పుడూ ఎరగనాయిరి! అదీకాక, బాబుగోరి దగ్గర్నుంచి, ఒక వుత్తరమ్ముక్కేనా పట్టుకొచ్చావు కావు. నీకు నేను అంత వెలగల వస్తువు ఎలా యిస్తాను చెప్పు" అంది ఆవిడ!

"అది కాదమ్మా! బాబుగోరే స్వయంగా చెప్పారండీ, దాన్ని పట్టుక రమ్మని" అన్నాడు వాడు.

అన్నాడే కాని, వాడి గుండెలు పీచుపీచు మంటున్నాయి.

రవణమ్మ "పోనీ యివ్వ డేమీ మించిపోలేదు కదా! ఒక చీటీ పట్రాకూడదూ!" అంది.

"సాలా దూరం వుంద మ్మా ఆఫీసు. నామీద మీకంత అనుమానం ఎందుకమ్మా? నిజంగా



"అన్నట్లు మరిచిపోయానండోయ్!, కాసులపేరు పెరిగిపోయింది!!"

## ★ ఎదురు తిరిగింది ★

బాబుగారు తెమ్మన్నారు." అన్నాడు.

ఇలా అనేటప్పటికి రవణమ్మకి అనుమానం వేసింది.

ఆవిడ "ఎవడవిరా నువ్వు? ఇవ్వనంటూంటే నీక్కాదు. ఇంత బలవంతపెడ్తున్నావేం? ఉండు. మా వాణ్ణిచ్చి, పంపిస్తున్నా బాబుగారి దగ్గరికి" అని, "ఒరేయ్! సూరీ!" అని కేకవేసి, తీసుకరావడానికి కాబోలు యింటిలోకి వెళ్ళింది.

మన దొంగ గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. పై ప్రాణాలు పైనే పోయాయి. "ఇప్పుడు వీళ్ళ చేతిలో పడ్డానంటే జైలు కెళ్ళడం తప్పదు" అనుకున్నాడు.

రవణమ్మ మళ్ళీ వచ్చి, చూసేసరికి లేడు.

సాయంత్రం భర్త వచ్చాక "మీరు వస్తువులన్నీ కొని, ఎవడి చేతనో పంపారుగా. అన్నీ సరీగా వున్నాయి" అంది.

రామయ్య పంతులు బిత్తరపోయి చూస్తూ, "కొనడమేమిటి?, పంపడమేమిటి? నేనేమీ పంపలేదే" అన్నాడు.

"పంపకపోవడమేమిటండీ! ఎవడో వచ్చి, పంపమన్నారని చెప్పేడు? పైగా మీరు కాసులపేరు కూడా తెమ్మన్నారట?"

"కొంపతీసి యిచ్చేశావేమిటి? నేనెవడిచేతా పంపలేదే."

రవణమ్మ నవ్వుతూ "ఇవ్వలేదులెండి. ఎవడో వచ్చి, మీరు యిమ్మన్నారని మొన్న నేను మీతో చెప్పిన వస్తువులన్నీ కొని తెచ్చి, కాసులపేరు యిమ్మని, అడిగాడు. ఆ వస్తువులన్నీ యింట్లో పెట్టి, మీరు యిమ్మన్నారో లేదో తెలుసుకోడానికి సూరినిపిలుద్దామని లోపలి కెళ్ళాను. వచ్చేసరికి లేడు" అంది.

పంతులు సంతోషంగా "హమ్మయ్య! భలే పనిచేశావు. నిన్ను బాగా నమ్మించడానికి అన్నీ కొని తెచ్చాడు. ఈ నెల యాభై రూపాయలు మిగిలేయి." అని అన్నాడు భార్య చేసిన పనిని మెచ్చుకుంటూ. ఆ ఏభైతోనూ పై నెలలో కాసులపేరు బాగు చేయించాడు. ★